సాక్షి తిరుపతి

శనివారం । 29 । జూన్ । 2024



మామిడికి సిండికేట్ దెబ్బ

జిల్లాలో వ్యాపారులు, గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి మామిడి ధరలు తగ్గించేశారు. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

శ్రీకాళహస్తి పట్టణ శివారులో రూ.10 లక్షల విలువ చేసే 17 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



హాస్టల్ విద్యార్థులు గజ గజ

జిల్లాలోని వివిధ హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్లు అందలేదు. గాలివానకు విద్యార్థులు వణికిపోవాల్సి వస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్‌అదాలత్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 32 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

రేణిగుంట: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన రేణిగుంట సీడబ్ల్యూసీ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ధ్యానచంద్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో వినియోగించిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లను తీసుకొచ్చి ఇక్కడ భద్రపరిచారు. నెలవారీ తనిఖీలో భాగంగా వాటిని ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట డీఆర్వో పెంచల్‌కిషోర్, ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జ్ కోదండరామిరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏకపాత్రాభినయ పోటీలు



మాట్లాడుతున్న కోనేటి సుబ్బరాజు

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఏకపాత్రాభియ పోటీలు ఉంటాయన్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు పార్వతీ కల్యాణం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అలాగే ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకపాత్రాభియ పోటీలు, అనంతరం బూడిద సాంఘీక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది కళాకారులు హాజరు కానున్నట్టు తెలిపారు. విజేతలకు ముగింపు రోజైన ఆదివారం రాత్రి నిర్వహించే బహుమతి ప్రదానోత్సవంలో బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో సుబ్బరాజు నాట్యకళాపరిషత్ ఉపాధ్యక్షులు గోపాలరావు, శాంబోలు హరినాథ్, సహాయ కార్యదర్శి మునిసుబ్రమణ్యం, చంద్రబాబు, కన్నప్పగారి కేశవులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి




మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్: వ్యవసాయ ఆధునికసాగులో మెలకువల కోసం విద్యార్థివలే విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సెంటర్‌లో జిల్లా విస్తరణ అధికారులకు సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయో సైన్స్ ఇంటర్నేషనల్ (కాబి) సంస్థ వారి నేతృత్వంలో డిజిటల్ యాప్స్‌తోపాటు ఆన్‌లైన్ కోర్సులపై శిక్షణ ఇచ్చారు. కాబి సంస్థ దక్షిణ ఆసియా కో–ఆర్డినేటర్ మధు మంజరి నేతృత్వంలో ఆన్‌లైన్ శిక్షణ, డిజిటల్ యాప్స్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ పంటల ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి కాబి వారు అందిస్తున్న ప్లాంట్ వైస్ ప్లస్ టూల్ కిట్ డిజిటల్ సాధనాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. సకాలంలో పంటలకు వచ్చే ప్రమాదాలను పసిగట్టి, అంచనా వేయవచ్చన్నారు. కొత్త పద్ధతుల వైపు అన్నదాతలను నడిపించడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య, డివిజన్ వ్యవసాయ అధికారులు, గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులు, కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఉద్యోగులు శశికళ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల తీరుతో చిన్నారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. కార్పొరేట్ ఆర్భాటాల కారణంగా వయసుకు మించిన భారం మోస్తున్నారు. ఇష్టారాజ్యంగా అంటగడుతున్న పుస్తకాలను మోయలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. లేలేత భుజాలపై మోపుతున్న బుక్స్ బరువుకు కుంగిపోతున్నారు. ఎదుగుదల లోపం వంటి అనారోగ్య సమస్యలకు గురై ఉక్కిరిబిక్కిరవుతున్న పిల్లలను చూసి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. నిబంధనలను పాటించని ప్రైవేట్ బడులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

బరువెక్కిన బడి సంచి



- పిల్లల్లో సాధారణంగా 15 ఏళ్ల లోపే శరీరంలో వివిధ మార్పులు చోటు చేసుకుంటాయి.
- పాఠశాల వయసులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడం వల్ల స్కోలియోసిస్ (వెన్నెముక ఒక వైపు వంగిపోవడం) వంటి ఇబ్బందులు తలెత్తుతాయి.
- అధిక బరువుతో కూడిన పెద్దసైజు బ్యాగులు కాకుండా పుస్తకాలకు సరిపడా తేలికైనవి కొనుగోలు చేయాలి.
- విద్యార్థి బరువులో పుస్తకాల బ్యాగు బరువు 15 శాతానికి మించకూడదు. ఉదాహరణకు 20 కిలోల బరువున్న విద్యార్థి 3 కిలోలకు మించి మోయకూడదు.
- ఎక్కువ పుస్తకాలుంటే ఉపాధ్యాయుల సలహా మేరకు ఏ రోజున అవసరమైన పుస్తకాలను ఆ రోజున తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బ్యాగును రెండు భుజాలపై సమాన బరువు పడే రీతిలో తగిలించుకోవాలి. ఒకవైపు తగిలించుకుంటే భుజం, మెడ నొప్పి వస్తాయి.
- బ్యాగు నడుము కింది వరకు వేలాడుతూ ఉండరాదు.
- నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరక పరమైన ఇబ్బందులను అధిగమించవచ్చు.

వైద్య నిపుణుల అభిప్రాయం ఇలా..

- బాల్యంపై స్కూల్ బ్యాగు భారం
- ఏటా పెరుగుతున్న పుస్తకాలు
- లేత భుజాలపై మోయలేని బరువు
- నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- పర్యవేక్షించని విద్యాశాఖ అధికారులు

ఉమ్మడి జిల్లా ప్రైవేట్ బడుల సమాచారం

చిత్తూరు జిల్లాలోని	తిరుపతి జిల్లాలోని
పాఠశాలలు 408	పాఠశాలలు 709
విద్యార్థులు 79,734	విద్యార్థులు 1,20,793

చిత్తూరు కలెక్టరేట్ : ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో పుస్తకాల భారం విద్యార్థులకు శాపంగా మారుతోంది. పై తరగతికి వెళ్లే కొద్దీ.. పుస్తకాల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. ప్రైవేటు స్కూళ్లలో వాటిని మోస్తూ పిల్లలు పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. బ్యాగు నిండా పుస్తకాలతో నాలుగైదు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు నానా తంటాలు పడుతున్నారు. పుస్తకాల భారం తగ్గించాలని 2006లో చట్టం చేసినా అమలుకు మాత్రం విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ప్రైవేట్‌గానూ కొనుగోలు..

ప్రభుత్వ పాఠశాలలు, సర్కారు గుర్తింపు పొందిన బడుల్లో విధిగా గవర్నమెంట్ ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు బోధన చేయాలి. స్టేట్, సీబీఎస్‌ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు మాత్రం ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్యపుస్తకాలతోపాటు ప్రైవేట్ ముద్రణ సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లిదండ్రులకు స్పష్టం చేస్తున్నాయి. దీంతో పాటు అదనపు పుస్తకాలను పాఠశాలలోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలను పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల బడి సంచి బరువుపై ప్రభుత్వం జీఓ నంబర్ 22 విడుదల చేసింది. తరగతుల వారీగా అన్ని యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లల్లో పుస్తకాల బరువు నిర్ణయించి, అంతే ఉండాలని స్పష్టం చేసింది. అయితే ఆ జీఓను ఏ ప్రైవేట్ పాఠశాల అమలు చేయడం లేదు.

నిబంధనలు బేఖాతర్

డీఈఓ ద్వారా వార్షిక విద్యా ప్రణాళిక విడుదల వుతుంది. పాఠ్యాంశాలు, పరీక్షలు, సాంస్కృతిక, ఆరోగ్య పరిరక్షణ కింద పలు అంశాలతో పట్టిక రూపొందించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల కోసం ప్రత్యేక నిబంధనలతో పట్టిక విడుదల చేసి, ఆయా పాఠశాలల్లో రోజువారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై నిరంతరం తనిఖీలు చేపట్టాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఆ విధానం అమలు కావడం లేదు.

అనవసరమైనవే ఎక్కువ

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు 6 నుంచి 7 వరకు పాఠ్యపుస్తకాలు, మరో 6 నోట్ బుక్స్, కాపీరైట్‌కు సంబంధించి 4 పుస్తకాలు ఉంటాయి. ప్రైవేట్ పాఠశాలలు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 10 నుంచి 34 వరకు పుస్తకాలు, నోటుబుక్స్ అమ్ముతున్నారు. తల్లిదండ్రులపై ఫీజులు, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నారు. ఒకటో తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 14 పుస్తకాలు ఉండాలి. కానీ, 32 నుంచి 34 ఉంటున్నాయి. ప్రింటెడ్ కాపీరైట్, ప్రింటెడ్ కలర్ కంపోజింగ్, హోమ్ స్కూల్ ఎక్సర్‌సైజ్, రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్, లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్ తదితరాలను అదనంగా జోడిస్తున్నారు.





అధిక బరువుతో ఉన్న బ్యాగులను మోసుకుంటూ పాఠశాలకు వెళుతున్న పిల్లలు

పర్యవేక్షణ శూన్యం



నిబంధనల అమలులో విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ శూన్యం. ప్రైవేట్, కార్పొరేట్ బడుల్లో ఇష్టానుసారం సొంతంగా ముద్రించిన పుస్తకాలను విక్రయిస్తున్నారు. ఈ మేరకు రూ.వేలు గుంజేస్తున్నారు. వీరి అంటగట్టే పుస్తకాలను మోయలేక చిన్నారులు అలసిపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు చేపట్టాలి. పిల్లలకు ఇబ్బందులు తప్పించాలి.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

అధిక బరువుతో విద్యార్థులకు నష్టం



అధిక బరువును విద్యార్థులు ఏ మాత్రం మోయకూడదు. పాఠశాల వయసులో పిల్లలపై ఎక్కువ భారం మోపుతున్నారు. దీంతో వెన్నెముకపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. సాధ్యమైనంత వరకు తక్కువ పుస్తకాలనే తీసుకెళ్లాలి.

– ప్రవీణ, మెడికల్ ఆఫీసర్, పూతలపట్టు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శించిన చెవిరెడ్డి



యుగంధర్ నాయుడుని పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

పాకాల: 'ఎన్ని కష్టాలు ఎదురైనా భయపడను. నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా. మీ కుటుంబ సభ్యుడిగా తోడుగా నిలుస్తా.. అధికార పార్టీ దాడులకు భయపడొద్దు. అండగా ఉంటా'నని డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యుగంధర్ నాయుడు అలియాస్ చంటిపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గురువారం రాత్రి దాడికి తెగబడిన విషయం తెల్సిందే. విషయం తెలుసుకున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శుక్రవారం చంటి స్వగ్రామమైన చెన్నుగారిపల్లికి చేరుకున్నారు. 'మీకు అండగా నేనుంటానంటూ ధైర్యం నూరిపోశారు. దాడి చేసిన వారిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అధికార పార్టీ నేతల అండదండలతో దాడికి తెగబడుతున్న వారిని అరెస్టు చేయకుండా వదిలేస్తుండడం వల్లనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెవిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై జిల్లా పోలీసు అధికారులకు తెలియజేసి, వారిపై కేసులు నమోదు చేసేలా చూస్తానని, లేని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాడుదామని బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. దాడులను సమష్టిగా ఎదుర్కొందాని పిలుపునిచ్చారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం



మున్సిపల్ కౌన్సిలర్లతో సమీక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, నాయకునికి పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి మరింత కృషిచేసేందుకు ప్రతిఒక్కరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలికార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, విబి పీ.లక్ష్మి, వైస్ చైర్మన్ బాలయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల్లో ఇన్‌చార్జ్‌ల పాలన!

- ఐఏఎస్ స్థాయి అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు
- వీసీ పదవికి పోటీ అధికమవడమే కారణం!
- అన్ని వర్సిటీల వీసీలు రాజీనామా చేయాలని ఉన్నత విద్యామండలి ఆదేశాలు
- జిల్లాలో ఇప్పటికే పలువురు రాజీనామా



తిరుపతి సిటీ: నూతన ప్రభుత్వం ఏర్పడి పట్టుమని నెల కూడా నిండకముందే వర్సిటీల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. అధికార పార్టీ అనుచరులమంటూ వర్సిటీలపై విచక్షణారహితంగా దాడులు చేసి వీసీ స్థాయి అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారు. ఇది మరువకముందే జిల్లాలోని అన్ని వర్సిటీల వీసీలు తక్షణమే రాజీనామా చేయాలంటూ ఏకంగా ఉన్నత విద్యామండలి అధికారుల నుంచి ఫోన్లలో వారికి మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి రెండు రోజుల ముందే తన పదవికి రాజీనామా సమర్పించారు. మహిళా వర్సిటీ వీసీ డీ.భారతి నాక్ కమిటీ విధులలో ఉండడంతో ఇప్పటి వరకు ఆమె రాజీనామా విషయంలో స్పష్టత రాలేదు. అదేవిధంగా కుప్పం ద్రవిడ వర్సిటీ వీసీ మధుజ్యోతి సైతం శుక్రవారం రాజీనామా చేయగా.. వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివ మూర్తి రాజీనామా సమర్పించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం కుప్పం పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడును వీసీ, రిజిస్ట్రార్ పదవుల ఆశావాహులు పెద్ద సంఖ్యలో కలిశారు. సీఎం నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో నిరుత్సాహంతో వెనుగుదిరిగినట్లు తెలిసింది.

ప్రభుత్వానికి తలనొప్పిగా వీసీ పదవులు

వీసీ పదవులకు ఇటు జనసేన, అటు టీడీపీ అనుచరుల మధ్య గట్టిపోటీ నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వానికి వీసీ పదవుల భర్తీ తలనొప్పిగా మారింది. కుల రాజకీయాలు వర్సిటీలో మళ్లీ మొదలైనట్లు గుర్తించిన ప్రభుత్వం కొన్ని రోజుల పాటు ఐఏఎస్ స్థాయి అధికారిని ఇన్‌చార్జి వీసీలుగా నియమించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జిల్లా జేసీ, కలెక్టర్లను నియమించే ఆలోచన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఐఏఎస్ స్థాయి అధికారిని నియమిస్తే ఒత్తిడి తగ్గుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు వర్సిటీలో అధికారులు చర్చించుకుంటున్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా భూపతినాయుడు

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా భూపతినాయుడు నియామకం దాదాపుగా ఖరారైనట్లు సమాచారం. ఎంతో మంది ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేసినప్పటికీ మంత్రి లోకేష్ ఆయన పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. జాగ్రఫీ విభాగంలో పనిచేస్తున్న బలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ విశ్వప్రయత్నాలు చేసినా కమ్మ సామాజిక వర్గంవైపే ప్రభుత్వం మొగ్గు చూపినట్లు సమాచారం.

తిరుమల ఘాట్‌లో ఏనుగుల కలకలం



మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద ఏనుగుల గుంపు

తిరుమల: తిరుమల నుంచి తిరుపతి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో ఏనుగుల మంద కలకలం సృష్టించిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు సమీపంలో రోడ్డుకు దగ్గరగా ఆరు ఏనుగుల గుంపు చేరింది. సమీపంలోని చెట్లను విరగ్గొడుతుండడంతో అటుగా వెళుతున్న వాహన చోదకులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని పెద్ద శబ్దాలు చేసి ఏనుగుల గుంపును అడవిలోకి పంపివేశారు. కొంతసేపు ఏనుగుల గుంపును చూసి వాహనచోదకులు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. అనంతరం భద్రతా సిబ్బంది వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పోషక విలువలు కలిగిన వంగడాల ఉత్పత్తే లక్ష్యం



మాట్లాడుతున్న ఐసీఏఆర్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ

తిరుపతి సిటీ: ప్రధానంగా మూడేళ్లుగా వాతావరణ పరిస్థితులకు, చీడపీడలకు తట్టుకుని అధిక దిగుబడితో పాటు అధిక పోషక విలువలు కలిగిన వంగడాలను గుర్తించి రైతుల సాగుకోసం సిఫారసు చేయాలని ఢిల్లీ ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో ఢిల్లీ ఐసీఏఆర్, హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్, తిరుపతి ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరిగిన అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఢిల్లీ ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ దేశ వ్యాప్తంగా సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలకు పలు సూచనలు చేశారు. చిరుధాన్యాల పంటలలో వచ్చే తెగుళ్లను హాట్ స్పాట్‌గా గుర్తించినప్పుడే సత్వర పరిష్కారం దొరుకుతుందన్నారు. ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ ఎస్‌కే ప్రధాన్, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారాసత్యవతి, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ వీ.సుమతి, డాక్టర్ ఈశ్వర్‌రామిరెడ్డి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మధుసూదన్, సుమారు 220 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

తిరుమలలో తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుమల: తిరుమలకు విచ్చేసే భక్తులకు మరింత నాణ్యమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే టీటీడీ లక్ష్యమని ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శుక్రవారం సాయంత్రం ఈఓ, జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి తిరుమలలోని పెద్ద, జనతా హోటళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రముఖ హోటళ్లతో జాబితా రూపొందించడానికి ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు చలేశ్వరరావు, తాజ్ హోటల్స్ జీఎం చౌదరి సూచనలను ఆహ్వానించినట్లు తెలిపారు. ముందుగా తిరుమల ఎస్టేట్స్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలోని హోటళ్ల గురించి వివరించారు.

వైభవంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణచేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

ముగ్గురు టీడీపీ నాయకులపై కేసు

సాక్షి ఎఫెక్ట్..

ఏర్పేడు: ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ప్రహరీ గోడ, గేటు ధ్వంసం చేసిన ఘటనలో ముగ్గురు టీడీపీ నాయకులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మండలంలోని గుండ్లకండ్రిగలో సర్వే నం.70లో 2.46 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. అవి ఆక్రమణకు గురికాకుండా పంచాయతీ అధికారులు ప్రహరీ గోడ, గేటును ఏర్పాటు చేశారు. ఈనెల 16న గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీధర్, విజయ్‌భాస్కర్, చంద్రశేఖర్ సదరు భూములు తమవంటూ జేసీబీతో ప్రహరీగోడ, గేటును ధ్వంసం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రాజేష్, తహసీల్దారు, కలెక్టర్ కార్యాలయాలు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణానంతరం వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఇదిలావుండగా ప్రహరీ గోడ, గేటు ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి ఈనెల 17న 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీసులు స్పందించి, విధ్వంసానికి కారకులైన వారిపై చర్యలు చేపట్టారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎడిఫై విద్యార్థి



ఎంపికైన అనిరుధ్ శ్రీరామ్ రాజా

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరులోని ఎడిఫై పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అనిరుధ్ శ్రీరామ్ రాజా జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ నెల విజయవాడలోని శాతవాహన డిగ్రీ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–10 బాలుర ఆర్చరీ పోటీలకు ఎంపికై విజయం సాధించి, జాతీయ స్థాయిలో ఆర్చరీ పోటీలకు ఎంపికవ్వడంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీపద్మావతి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ సులోచన, ఎడిఫై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ విద్యార్థిని అభినందించారు. విద్యార్థి ఇంతటి స్థాయికి తీసుకొచ్చిన గాండీవ ఆర్చరీ అకాడమీ శిక్షణ కేంద్రాన్ని అభినందిస్తూ, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

మామిడికి సిండికేట్ దెబ్బ!

తగ్గిపోయిన మామిడి ధర

- ఒక్కటైన వ్యాపారులు, గుజ్జు పరిశ్రమల యజమానులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్



సాగులో ఉన్న తోతాపురి



మార్కెట్‌కు తరలిస్తున్న తోతాపురి

తిరుపతి అర్బన్: సాధారణంగా ఏ పంట సాగుచేసినా విక్రయించే సమయంలో దిగుబడి పెరిగితే ధరలు తగ్గుతాయి. అదే దిగుబడి తగ్గితే ధరలు పెరగడం సర్వసాధారణం. అయితే ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గినా ధరలు పెరగడంలేదు. మామిడి వ్యాపారులు, గుజ్జు పరిశ్రమల యాజమానులు ధరలను తమ గుప్పిట్లో పెట్టుకుని రైతులను నష్టాల ఊబిలోకి నెట్టేస్తునఆనరు. ఫ్యాక్టరీల యజమానులు సిండికేట్‌గా మారి మామిడి ధరను భారీగా తగ్గించేస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాతావరణ ప్రభావంతో ఈసారి మామిడి దిగుబడి కుదేలైంది. అరకొర వచ్చిన పంటకైనా గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశపడ్డారు. తొలుత మామిడి ధరలు ఊరించినా చివరకు నట్టేట ముంచుతున్నాయి. వ్యాపారులు సిండికేట్ కావడంతో ధరలు అమాంతం తగ్గిపోతున్నాయి.

ధరలు పెంచండి మహాప్రభో

మామిడికి గిట్టుబాటు ధర అందించాలంటూ కలెక్టర్ హెచ్ఎం ధ్యాన్‌చంద్రతోపాటు జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డికి రైతులు మొరపెట్టుకుంటున్నారు. స్పందించిన కలెక్టర్ తోతాపూరి మామిడి రకానికి టన్నుకు రూ.30వేలు తక్కువ లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. అంతకన్నా తక్కువకు కొనుగోలు చేస్తే చర్యలు ఉంటాయని వ్యాపారులను హెచ్చరించారు. మరోవైపు ఉద్యానశాఖ అధికారి పదేపదే పరిశ్రమల యాజమాన్యానికి మామిడి దిగుబడి పరిస్థితులను వివరించారు. అయినా వీరిమాటలు వినేవారు కరువయ్యారనే చెప్పవచ్చు. మొన్నటి దాకా టన్ను తోతాపురి రూ.28 వేలు ఉండగా గురువారం రూ.23 వేలకు పడిపోయింది. ఈ వారం రోజులు మార్కెట్‌కు కాయలు ఎక్కువగా రావడంతోనే ధరలు తగ్గాయని వ్యాపారులు అంటున్నారు.

తగ్గిన మామిడి దిగుబడి

జిల్లాలో 54 వేల ఎకరాల్లో మామిడి పంటను 17,500 మంది రైతులు సాగుచేశారు. ఇందులో 36వేల ఎకరాల్లో తోతాపురి రకం మామిడిని సాగు చేశారు. మిగిలిన 18 వేల ఎకరాల్లో బేనీషా, పులిహోరా, ఖాదర్, నీలం, మల్లిగూబ, రాయల్ స్పెషల్, అంటుమామిడి తదితర రకాలు సాగులో ఉన్నాయి. జిల్లాలో ఆరు గుజ్జు పరిశ్రమలు ఉండగా.. 50 మందికి పైగా వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు మామిడిని తరలిస్తుంటారు. ఈ సారి దిగుబడి తగ్గినా పాత ధరలకే అడగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఎకరం 10 టన్నుల నుంచి 15 టన్నులు వరకు పంటదిగుబడి వస్తుంది. అయిఏత ఈ సారి ఎకరానికి కేవలం 2 నుంచి 3 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రధానంగా సాగుచేసిన తోతాపూరి రకం టన్ను రూ.18 వేల నుంచి రూ.23 వేలు ఉండేది. అయితే దిగుబడి బాగా తగ్గిపోవడంతో టన్ను రూ.30 వేలు ఉంటుందని భావించారు. అధికారులు ఆదే విషయాన్ని వెల్లడించారు. అయితే వ్యాపారులు మాత్రం సాధారణ ధరలకే కొనుగోలు చేస్తున్నారు.

టన్నుకు రూ.30 వేలు ఇవ్వాల్సిందే



ఈ సారి దిగుబడి బాగా తగ్గింది. పెట్టుబడులు పెరిగాయి. ఈ క్రమంలో వ్యాపారులు టన్ను తోతాపూరి రకం మామిడిని రూ.30వేలకు తక్కువ లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చాం. ఆ మేరకు ఉద్యానశాఖ అధికారులను పర్యవేక్షణ చేయాలని చెప్పాం.

-ధ్యానచంద్ర హెచ్ఎం, కలెక్టర్, తిరుపతి

వ్యాపారులతో మాట్లాడుతున్నాం



కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు వ్యాపారులతో మాట్లాడుతున్నాం. టన్ను తోతాపూరి రకం మామిడిని రూ.30వేలకు కొనుగోలు చేయాలని చెబుతున్నాం. అయితే వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఆసక్తి గల వ్యాపారులతో మాట్లాడుతున్నాం. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్న వారితోనూ సంప్రదింపులు జరుపుతున్నాం. మరోవైపు గుజ్జు పరిశ్రమల యజమానులనూ సంప్రదిస్తున్నాం. ధరలు తగ్గిస్తే రైతులు నష్టపోతారని భావిస్తున్నాం.

-దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

జనరల్ మేనేజర్ పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల సహకార పరపతి సంఘంలో కాంట్రాక్టు పద్ధతిలో జనరల్ మేనేజర్‌గా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు అడసలపల్లి వాసు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేడర్‌లో పనిచేసి పదవీ విరమణ పొంది 65 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. జూలై ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ పరిపాలనా భవనంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లు 77807 95330, 99596 70942లో సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆర్.శారద జయలక్ష్మి

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, విజయవాడ పద్మావతి వెంకటేశ్వర ఫౌండేషన్ సంయుక్త ఆర్థిక సాయంతో తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను వర్సిటీ వీసీ ఆర్.శారద జయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులకు కంప్యూటర్స్‌పై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరిశోధక సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, తిరుపతి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సుమతి, కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, మోహన్‌నాయుడు, పి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతునిపై సుందరరాజస్వామి



హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీసుందరరాజ స్వామి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీసుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనాలతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ స్వామివారి ముఖమండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారి హనుమంత వాహన సేవ వైభవంగా సాగింది. శనివారం రాత్రి స్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, సూపరిటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేష్, అర్చకులు బాబుస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీలో సమస్యలపై దృష్టి సారించండి



ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో నెలకొన్న సమస్యలపై ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ చంద్రయ్యకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో వైఫై లేకపోవడంతో ఆన్‌లైన్ క్లాసులకు కష్టంగా ఉందన్నారు. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు కళాశాలలు వర్సిటీ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసే ప్రమాదం ఉందన్నారు. ఫీజుల కంటే స్టేషనరీ, ఎగ్జామ్ రుసుము, పుస్తకాల ఫీజు నెపంతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, వినోద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారికి ఇష్టమైన సేవలను పునఃప్రారంభించాలి



చీర్ల కిరణ్

తిరుపతి(అలిపిరి): తిరుమలలో శ్రీవారికి ఇష్టమైన సేవలను మళ్లీ పునః ప్రారంభించాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. శ్రీవారికి ఎంతో ప్రీతి పాత్రమైన కళ్యాణోత్సవం లడ్డు, వడ కౌంటర్ గతంలో ఆలయంలో ఉండేదని.. ఆ కౌంటర్‌ను బయటకు తరలించి పెద్ద లడ్డు, వడ పవిత్రతను భంగం చేశారని ఆయన విమర్శించారు. శుక్రవారం ఆయన టీటీడీ పరిపాలనా భవనంలో విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఉన్న విధంగా శ్రీవారి కళ్యాణం పెద్ద లడ్డు, వడ కౌంటర్‌లను ఆలయంలోకి తరలించి వాటి పవిత్రతను కాపాడాలని కోరారు. శ్రీవారికి ఎంతో ఇష్టమైన ప్రతి సోమవారం నిర్వహించే విశేష పూజ, బుధవారం నిర్వహించే సహస్ర కలశాభిషేకం సేవ, శుక్రవారం నిర్వహించే నిజపాద దర్శనం సేవ, రోజూ నిర్వహించే వసంతోత్సవం సేవలను తిరిగి ప్రారంభించాలని కోరారు. శ్రీవారి అర్చన అనంతర దర్శనం నిలిపివేసి భక్తులకు ఆ సేవా భాగ్యాన్ని దూరం చేశారన్నారు. గతంలో ఉన్న విధంగా వీఐపీ బ్రేక్ దర్శనం సమయాలను మార్పు చేసి భక్తులకు మేలు చేయాలన్నారు.

కేవీకేకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభ పురస్కారాన్ని స్వీకరిస్తున్న గోవిందరాజులు

వెంకటగిరి రూరల్: ఉద్యాన విభాగంలో రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించే దిశగా కృషిచేస్తున్న వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రానికి ప్రతిభా పురస్కారాలు లభించాయి. రాజమండ్రి, హైదరాబాద్‌లోని వ్యవసాయ సాంకేతిక పరిశోధన అనప్రయోగ సంస్థలు సంయుక్తంగా అటారి జోన్ 10 కింద 2023–2024 ప్రతిభ పోటీలు నిర్వహించాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచేరి రాష్ట్రాలకు చెందిన 72 కేవీకేల అధిపతులు పాల్గొన్నారు. ఇందులో వెంకటగిరి కృషి విజ్ఞన కేంద్రానికి రెండు ప్రతిభ పరస్కారాలు లభించినట్టు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీ.గోవిందరాజులు తెలిపారు. ఆ మేరకు అటారి డైరెక్టర్ డాక్టర్ శేష్‌ఎస్ మీరా చేతులు మీదుగా ప్రతిభ పురస్కారాలు అందుకున్నట్టు వెల్లడించారు. జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ, హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మధూర్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు గోవిందరాజులను అభినందించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ నిందితుడు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో పోలీసు సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారులో రూ.10 లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి సతీష్ కథనం.. శ్రీకాళహస్తి అటవీశాఖ అధికారులకు ముందస్తు సమాచారం రావడంతో గురువారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ కాలనీ వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న మహేంద్ర జై వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.10 లక్షల విలువ చేసే 17 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనంతో సహా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని నడుపుతున్న గుమ్మడిపూడికి చెందిన మోహన్ అరివిని అదుపులోకి తీసుకున్నారు. ఎర్రచందనం దుంగలు కేవీబీపురం మండలం, కాట్రపల్లి నుంచి వస్తున్నట్లు గుర్తించారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఆయన పేర్కొన్నారు. తలకోన భాకరాపేట అటవీ ప్రాంతాలలో ఇదే విధంగా ముందస్తు సమాచారం ఉందని, అక్కడ ఇప్పటికే పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒక రోడ్డుపై గస్తీలు కాకుండా అటవీ ప్రాంతంలో దాదాపు కొంతమంది పోలీసులతో వారానికి రెండు రోజులు కూంబింగ్ నిర్వహించే విధంగా కార్యాచరణ చేపడుతున్నామన్నారు.

ఏనుగుల కట్టడిలో వైఫల్యం

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఏనుగులను కట్టడి చేయడంలో అటవీశాఖ అధికారులు వైఫల్యం చెందారని రైతు సంఘం నేతలు మండిపడ్డారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. పలమనేరు, బంగారుపాళ్యం, తవణంపల్లె తదితర మండలాల్లో ఏనుగులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయన్నారు. ఈక్రమంలో పంటలను నాశనం చేయడంతో పాటు రైతులపై దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి అడవి ప్రాంతాలోసోలార్ ఫెన్సింగ్ వేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నాగరాజు, మునిరత్నంనాయుడు, దాసరిచంద్ర పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులు గజగజ

- ఇంతవరకు అందని దుప్పట్లు
- వాన, గాలికి వణుకుతున్న విద్యార్థులు
- దోమల బాధతో మరిన్ని ఇక్కట్లు



సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం

తిరుపతి అర్బన్: వసతి గృహాలు అందుబాటులోకి వచ్చినా విద్యార్థులకు దుప్పట్లు అందక నానా తిప్పలు పడుతున్నారు. గతంలో హాస్టల్స్ ప్రారంభించిన రోజే వారికి దుప్పట్లు పంపిణీ చేసేవారు. ఈ నెల 12వ తేదీన హాస్టల్స్‌ను ప్రారంభించినా ఇంతవరకు దుప్పట్ల ఊసేలేదు. సాధారణంగా బడుగుబలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటుంటారు. జిల్లాలో 62 ఎస్సీ హాస్టల్స్ ఉండగా.. అందులో ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 2,968 మంది, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో 734 మంది విద్యార్థులు తలదాచుకుంటున్నారు. మరోవైపు 64 బీసీ వసతి గృహాలుండగా ఇందులో ప్రీమెట్రిక్ హాస్టల్స్‌లో 2,926 మంది, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో 2,592 మంది విద్యార్థులు చదువుచున్నారు. అయితే వారికి ఇప్పటి వరకు ఎలాంటి దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయలేదు. విద్యార్థి కప్పుకోవడానికి ఒక దుప్పటి, కింద వేసుకోవడానికి మరో దుప్పటి చొప్పున రెండు ఇవ్వాల్సి ఉంది. కానీ రెండు దుప్పట్లు ఇవ్వకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కింద గార చల్లగా ఉండడంతో రాత్రుల్లో నిద్ర పట్టడంలేదని పలువురు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇక చీకటిపడితే దోమల బాధ ఎక్కువవుతోంది. కప్పుకోవడానికి కనీసం దుప్పటి కూడా లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని కన్నీటిపర్యంతమవుతున్నారు.

ప్రభుత్వం ఇస్తే అందిస్తాం



హాస్టల్స్‌ను ఈ నెల 12 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చాం. అయితే వారికి దుప్పట్లు ప్రభుత్వం ఇస్తేనే మేము పంపిణీ చేస్తాం. గత ప్రభుత్వంలో అదనంగా దుప్పట్లు ఇచ్చారు. కొన్ని దుప్పట్లు మిగిలి ఉంటే కొందరికి మాత్రమే ఇచ్చాం. మిగిలిన వారికి ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం అందించిన వెంటనే పంపిణీ చేస్తాం.

-చెన్నయ్య, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి

దుప్పట్లు ఇవ్వాల్సి ఉంది



జిల్లాలోని 5,518 మంది విద్యార్థులు బీసీ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. వారికి దుప్పట్లు ఇంకా ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి అందిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. కొత్తగా ఎవరైనా పిల్లలు చేరాలంటే జూలై 15వ తేదీ లోపు చేరాల్సి ఉంటుంది.

-చంద్రశేఖర్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి